ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

జనగామ

శుక్రవారం 24 మే 2024





ప్రాదేశిక ఎన్నికలపై అనిశ్చితి

హనుమకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జడ్పీటీసీలు), మండల పరిషత్తుల ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీలు) ఎన్నికలు గడువులోపు జరిగే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో గ్రామ పంచాయతీలకు మాదిరిగానే జిల్లా, మండల పరిషత్తులకు కూడా ప్రత్యేక పాలనాధికారులను నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో ప్రాదేశిక నియోజవర్గాల పాలక వర్గాల గడువు జూలై 4వ తేదీతో ముగియనున్నది. వాస్తవానికి 2019లో అప్పటి పాలకవర్గాల గడువు ఐదేళ్లు ముగియక ముందే.. రెండు నెలల ముందుగానే.. అంటే మే 15న ప్రాదేశిక ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో అప్పుడు ఎన్నికైన కొత్త పాలక వర్గాలు బాధ్యతలు చేపట్టడానికి రెండు నెలలు వేచి ఉండాల్సి వచ్చింది. కానీ ఈ సారి గడువు సమీపిస్తున్నా ఇప్పటి వరకు ఎన్నికల సమరంపై కసరత్తు ప్రారంభం కాలేదు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపుతో లోకసభ ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. ఆ తర్వాత వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించే దిశగా ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. మూడు విడతలుగా జరిగే ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తికావడానికి కనీసం రెండు నెలలైనా పడుతుంది. అప్పటికీ ప్రాదేశిక పాలకవర్గాల గడువు ముగుస్తుంది. ఆతర్వాతగానీ ప్రాదేశిక ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేపట్టే అవకాశాలు లేవు. అయితే పంచాయతీ ఎన్నికల కన్నా ప్రాదేశిక ఎన్నికల విషయంలో కొంత అనిశ్చితి నెలకొని ఉన్నది. స్పష్టత రావడానికి రాష్ట్ర ప్రభుత్వం కొంత ముందస్తు కసరత్తు చేయాల్సి ఉన్నది.

పునర్విభజనతో..

2019లో ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగి జడ్పీలు కొలువు దీరిన తర్వాత తదనంతర కాలంలో కొన్ని జిల్లాలు, మండలాల పునర్విభజన జరిగింది. దీనితో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల మార్పు జరిగింది. ఒక జిల్లాలో ఉన్న ప్రాదేశిక నియోజకవర్గాలు మరో జిల్లా పరిధిలోకి వెళ్లాయి. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలు హనుమకొండ, వరంగల్ జిల్లాలుగా మారడం ఇందుకు ఉదాహరణ. అయితే అప్పటికే జిల్లా ప్రజాపరిషత్తు, మండల ప్రజాపరిషత్తులు కొలువు తీరడం వల్ల అవి ఇప్పటి వరకు పాత జిల్లాల పరిధిలోనే కొనసాగుతూ వస్తున్నాయి. ఇప్పుడు ప్రాదేశిక ఎన్నికలు కొత్తగా చేరిన జడ్పీటీసీలు, ఎంపీటీలను కలుపుకొని ఎన్నికలు నిర్వహిస్తారు.

మొదలుకాని కసరత్తు

జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించాలంటే రిజర్వేషన్లు, ఓటర్ల ముసాయిదా జాబితా, పోలింగ్ బూత్‌ల ఎంపిక, అధికారులకు శిక్షణ వంటి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉంది. కానీ ఇప్పటి వరకు ఈ ప్రక్రియలేవి ప్రారంభం కాలేదు. ఒక వేళ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా పనులన్నీ చక్కబెట్టాలంటే కనీసం మూడు నెలలైనా పట్టే అవకాశం ఉన్నట్టు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అంటే గడువులోపు ఎన్నికలు జరగడం అసాధ్యంగా కనిపిస్తోంది.

ఇప్పటికప్పుడు అసాధ్యం

ఇప్పటికిప్పుడు ప్రభుత్వం ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించినా క్షేత్ర స్థాయిలో వీలు పడకపోవచ్చు. 2019లో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 71 జడ్పీటీసీలు, 1,030 మండల ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ) ఉన్నాయి. వాటికి ఎన్నికలు నిర్వహించిన సమయంలో కొత్తగా అమల్లోకి వచ్చిన పంచాయతీరాజ్ శాఖ చట్టం ప్రకారం అప్పటి రిజర్వేషన్లు రెండు పర్యాయాలు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దృష్ట్యా ఈసారి కూడా అవే రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంటుంది. కానీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. గత ప్రభుత్వం హయాంలో రాజకీయ ప్రాబల్యాలను దృష్టిలో పెట్టుకొని కొత్త మండలాల ఏర్పాటు జరిగింది. ఎన్నికల అనంతర కాలంలో కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని కొత్త మండలాలు కూడా ఏర్పడ్డాయి. జిల్లాల పునర్విభజన జరిగింది. ఈ క్రమంలో ములుగు జిల్లా కొత్తగా ఏర్పాటైంది. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లా స్థానే హనుమకొండ, వరంగల్ జిల్లాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మండలాల బదిలీ జరిగింది. ఇలా జరిగినా.. ఈ మండలాలు పాత జడ్పీ పాలక వర్గ పరిధిలోనే ఇప్పటి వరకు కొనసాగుతూ వచ్చాయి. బీసీ ఓటర్ల సంఖ్య పెరగడంతో రిజర్వేషన్లలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నట్టు పంచాయతీరాజ్ శాఖ అధికారులు భావిస్తున్నారు. అయితే కొత్త ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల వివరాలను అడగడంతో వివరాలను పంపించారు. జులై 5తో జిల్లా పరిషత్తు, మండల పరిషత్తుల పాలకవర్గాల గడువు ముగియనుండడంతో తదుపరి ప్రభుత్వ ఆదేశాల కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. ఆ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

- జూలై 4వతేదీతో ముగియనున్న గడువు
- ఇంకా మొదలుకాని ఎన్నికల కసరత్తు
- ప్రత్యేకాధికారులను నియమించే అవకాశం
- మండలాల పునర్విభజన, రిజర్వేషన్లపై అస్పష్టత
- గతంలో రెండు నెలలు ముందుగానే ఎన్నికలు
- ఈసారి సకాలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ పోరు జరిగేనా?

జడ్పీటీసీలు, ఎంపీటీసీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 71 జడ్పీటీసీ, 1030 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో ప్రస్తుతం 7 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. అవి హసన్‌పర్తి, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు, ధర్మసాగర్, ఐనవోలు. జిల్లాల పునర్విభజన ఫలితంగా ఐదు మండలాలు ఆత్మకూరు, శాయంపేట, దామెర, పరకాల, నడికూడ హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చాయి. దీనితో హనుమకొండ జిల్లాలో జడ్పీటీసీ స్థానాల సంఖ్య 12కు పెరగనున్నది. జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు 86 ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా పరిధిలో ప్రస్తుతం 16 జడ్పీటీసీలు ఉన్నాయి. ఏడాది కిందట మండలాల పునర్విభజనతో రెండు మండలాలు సీరోలు, ఇనుగుర్తి వచ్చి చేరాయి. దీంతో ఈ జిల్లాలో మొత్తం జడ్పీటీసీల సంఖ్య 18కి చేరనున్నది. ఎంపీసీ స్థానాలు 198 ఉన్నాయి. జనగామ జిల్లాలో 12 జడ్పీటీసీలు, 141 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రస్తుతం 11 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. కొంత కాలం కిందట పునర్విభజనతో గోరికొత్తపల్లి వచ్చి చేరింది. దీంతో ఈ జిల్లాలో జడ్పీటీసీల సంఖ్య 12కు చేరనున్నది. ఎంపీటీసీ స్థానాలు 106 ఉన్నాయి. ములుగు జిల్లాలో 9 జడ్పీటీసీలు ఉన్నాయి. ఎంపీటీసీలు 87. వరంగల్ జిల్లాలో 16 జడ్పీటీసీలు, 412 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.

కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, మే 23: రైతులకు కల్తీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని, వారిని మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో డీసీపీ సీతారాం, ఏసీపీ అంకిత్‌కుమార్ శంఖ్వార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ వానాకాలం పంటల గురించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు ఎక్కువగా ఎవ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారన్నారు. జిల్లాలో 237 లైసెన్స్‌డ్ విత్తనాల షాపులు, 238 ఎరువుల షాపులు, 183 పురుగు మందుల షాపుల డీలర్లు ఉన్నారన్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, విత్తన, ఎరువుల డీలర్లు సమన్వయంతో పని చేయాలని, నకిలీ, కల్తీ విత్తనాల సరఫరా జరుగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. వానాకాలం పంట కోసం నాణ్యమన విత్తనాలను మాత్రమే విక్రయించాలని పేర్కొన్నారు. రైతులు విత్తనాల విషయంలో ఏమైనా సందేహాలుంటే వెంటనే 93986 16041 టోల్‌ఫ్రీ నంబరులో వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. రైతుల సమస్యల పై వెంటనే స్పందించి పరిష్కరించాలని, వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని, వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో రైతులకు నాణ్యమైన విత్తనాల కొనుగోలు పై రైతు వేదికల్లో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లా పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని, విస్తృత తనిఖీలు నిర్వహించాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే జైలుపాలు : డీసీపీ సీతారామ్

విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా జైలు పాలవుతారని జనగామ డీసీపీ సీతారామ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటించని దుకాణ యజమానులపై విత్తనాల చట్టం - 1966, సీడ్ రూల్స్ - 1968, సీడ్ కంట్రోల్ ఆర్డర్ - 1983, ఈసీ చట్టం - 1955 కింద కేసులు నమోదు చేసి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతులకు విక్రయిస్తామని అధికారులు, డీలర్లు ప్రతిజ్ఞ చేశారు. అంతకు ముందు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలపై డీలర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈఓ వినోద్‌కుమార్, విత్తనాల దుకాణాల అసోసియేషన్ అధ్యక్షుడు పజ్జూరి గోపయ్య, ఏడీఏలు, అన్ని మండలాల వ్యవసాయ అధికారులు, విత్తన, ఎరువుల డీలర్లు, పురుగు మందుల దకాణాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూములను తనిఖీ చేసిన కలెక్టర్



స్ట్రాంగ్ రూము వద్ద రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్

జనగామ కల్చరల్, మే 23: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో లోకసభ ఎన్నికల ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గురువారం తనిఖీ చేశారు. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉన్న స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి శాసనసభ నియోజక వర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూములలో భద్రపరచగా సాధారణ తనిఖీలో భాగంగా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాటు చేసిన భద్రతను, రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ, తదితర వాటిపై ఆరా తీసి తగిన సూచనలు చేశారు. తనిఖీలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు షాకివ్వాలి..



రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత పట్టభద్రులపైనే ఉంది

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

7లో

అకాల వర్షం.. అన్నదాతకు కష్టం..

ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

ఘన్‌పూర్-జఫర్‌గడ్ ప్రధాన రోడ్డు పైన కూలిన భారీ వృక్షం

స్టేషన్‌ఘన్‌పూర్, మే 23: అకాల వర్షం, గాలివాన అన్నదాతలను అతలాకుతలం చేసింది. చేతికొచ్చిన ధాన్యం వర్షపు నీటికి తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం అర్ధరాత్రి కురిసిన గాలివాన బీభత్సంతో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని పాంనూర్ గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం రాశుల కిందకు వర్షంనీరు చేరడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. రైతులు ధాన్యంను మరో చోటు ఆరబోయడానికి ఇబ్బందులు పడ్డారు. మండలంలోని నమిలిగొండ గ్రామం వద్ద ఘన్‌పూర్-జఫర్‌గడ్ ప్రధాన రోడ్డు పైన అడ్డంగా భారీ వృక్షం కూలి పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఘన్‌పూర్ తదితర పట్టణాలకు చెందిన ప్రయాణికులు జఫర్‌గడ్, వర్ధన్నపేట, ఖమ్మం, తదితర ప్రాంతాలకు వెళ్లేవారు రోడ్డుకు అడ్డంగా వృక్షం కూలిపడడం ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు ప్రక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పై పడడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసందానంగా ఉన్నటువంటి నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో నెమలిగొండ గ్రామానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది మరమ్మతు చేసి సరఫరా అందించారు. నెమలిగొండ గ్రామ పంచాయతీ సిబ్బంది, జేసీబీల సహకారంతో రోడ్డుకు అడ్డంగా కూలిన వృక్షంను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.



రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం



ధాన్యం కుప్ప కిందకు చేరిన నీటిని తొలగిస్తున్న రజిత



ఘన్‌పూర్-జఫర్‌గడ్ రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

టీకాలతో చిటుకు వ్యాధి నివారణ

- జిల్లా వ్యాప్తంగా 2,25,612 గొర్రెలకు టీకాలు



చిల్పూరు మండలం మల్కాపూర్ లో గొర్రెలకు టీకాలు వేస్తున్న అధికారులు

జనగామ కల్చరల్, మే 23: గొర్రెలకు సాధారణంగా వచ్చే చిటుకు వ్యాధిని నివారించేందుకు గాను పశుసంవర్ధక శాఖ టీకాల కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా చిటుకు వ్యాధి తీవ్రత ఉన్న గ్రామాలను గుర్తించి టీకాలు వేసే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా 59 గ్రామాలలో 2,25,612 గొర్రెలకు టీకాలు వేయాలని అధికారులు గుర్తించారు. వానాకాలంలో తొలకరి జల్లులకు పచ్చిక మేసినప్పుడు దాని ద్వారా క్లాస్టీడియం బ్యాక్టీరియా ద్వారా చిటుకు వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలకు వైద్యం చేయించే లోగానే మరణించే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి యేటా చిటుకు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని అధికారులు చేపడుతుంటారు.

గొర్రెలకు టీకాలు వేయించాలి : మనోహర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

జిల్లా వ్యాప్తంగా గొర్రెలకు చిటుకు వ్యాధి టీకాలు గురువారం నుంచి ప్రారంభించాము. గొర్ల పెంపకం దారులు గతంలో చిటుకు వ్యాధి వచ్చిన దాఖలాలు ఉన్నచో వెంటనే సమీప వైద్యుని సంప్రదించాలి. ముందుగానే టీకాలు వేయించుకున్నట్లయితే వాటి మరణాల సంఖ్యను తగ్గించవచ్చు. చిటుకు వ్యాధిని కూడా నివారించవచ్చు. గొర్ల పెంపకందారులు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

మండలం	గ్రామాలు	టీకాలు వేయాల్సిన గొర్రెల సంఖ్య
బచ్చన్నపేట	6	26526
చిలుపూరు	5	9601
దేవరుప్పుల	5	16582
జనగామ	4	13012
కొడకండ్ల	4	18501
లింగాలఘణపురం	6	37233
నర్మెట	2	7899
పాలకుర్తి	6	26250
రఘునాథపల్లి	7	17195
స్టేషన్‌ఘన్‌పూర్	5	22740
తరిగొప్పుల	3	4663
జఫర్‌గడ్	6	25410
మొత్తం	**59**	**225612**

కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్‌సింగ్

చిలుపూర్, మే 23 : మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ళను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్‌సింగ్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని నష్కల్‌లో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రోహిత్ సింగ్ మాట్లాడుతూ, ఒక్క నష్కల్ గ్రామంలోనే ఇప్పటివరకు 21 లారీల ధాన్యాన్ని తరలించడం శుభపరిణామమన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు త్వరితగతిన చెల్లింపులు జరిపేలా రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. తడిసిన ప్రతీగింజను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ కలువల శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం ఈద రమేష్ కుమార్, సీసీ గట్టు శ్రీనివాస్, వీవోఏలు చిర్ర భాగ్యలక్ష్మి, రంగు కవిత, రాధిక, స్వప్న, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

2లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ ఏది?

- జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండా మొండిచేయి
- పెద్దల సభకు విద్యావంతులను పంపాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీ‌ష్‌రావు

తొర్రూరు రూరల్, మే 23: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఇస్తామన్న రెండు లక్షల ఉద్యోగ నోటిఫికేషన్ ఏమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీ‌ష్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం తొర్రూరు మండలం వెల్లికట్టె గ్రామ శివారులో పాలకుర్తి నియోజకవర్గ పట్టభద్రులతో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హరీ‌ష్‌రావు మాట్లాడుతూ అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ బాండ్ పేపర్లు ఇచ్చిందని, అవి చెక్కుల మాదిరిగా బౌన్స్ అయినట్లు ఆరోపించారు. చెక్కులు బౌన్ అయితే కేసులు పెట్టి శిక్షించే విధంగా వారిని శిక్షించాలన్నారు. రైతులకు రూ.500 బోనస్ ఇస్తామని, రెండు లక్షల ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేస్తామంటూ బోగస్ మాటలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం 24గంటల కరెంట్, రూ.500 బోనస్ ఇవ్వకుండా సంబంధిత ఉద్యోగులను వేధిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించిన ఉద్యోగాలకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి 30వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని హరీ‌ష్‌రావు అన్నారు. విద్యావంతుడు రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలను పట్టభద్రులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. పోరాటం చేసి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ చేతుల్లో పెట్టడంతో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయన్నారు. ఐదు నెలలైనా ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్, డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతి, ఉద్యోగులకు పీఆర్సీ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లలో దేశంలో ఎక్కడాలేని విధంగా అభివృద్ధి చేసింది కేసీఆరేనని తెలిపారు.





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రులు హరీ‌ష్‌రావు, ఎర్రబెల్లి

హక్కుల కోసం పోరాడుతా.. : రాకేష్‌రెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపిస్తే రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతానని పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి అన్నారు. ఎంతో మంది మేధావులు, పెద్దలు కూర్చునే పెద్దల సభకు ప్రభుత్వానికి తొత్తులుగా మారిన వారిని గెలిపిస్తారో.... మీవాడినై హక్కుల కోసం పోరాటం చేసే తనను గెలిపిస్తారో మేధావులు ఆలోచించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు మధుసూదనాచారి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, చల్లాడ లక్ష్మీనర్సింహారావు, గాంధీనాయక్, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఎంపీపీ చిన్న అంజయ్య డాక్టర్ సోమేశ్వర్ రావు, బిల్లా సుధీర్‌రెడ్డి, గాంధీనాయక్, సీతారాములు, పాల్గొన్నారు.

నేడు పాలిసెట్

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



స్టేషన్ ఘన్‌పూర్ జూనియర్ కళాశాల సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్, మే 23: రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్-2024 శుక్రవారం జరుగనుంది. ఇందుకోసం ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు పాలిసెట్ వరంగల్ కన్వీనర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భైరి ప్రభాకర్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారని తెలిపారు. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించరని ఆయన స్పష్టం చేశారు. కాగా స్థానిక పాలిటెక్నిక్ కళాశాల సెంటర్‌లో, ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో పరీక్ష ఏర్పాట్లను స్పెషల్ అబ్జర్వర్ జి.నరేందర్ రెడ్డి, పాలిసెట్ కో ఆర్డినేటర్ డాక్టర్ పోచయ్య ఎలక్ట్రికల్ హెడ్ రామకృష్ణ, జనరల్ హెడ్ రాజ్‌కుమార్ పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పాలిసెట్ పకడ్బందీగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో 360 మంది, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 60 మంది ప్రవేశ పరీక్ష రాయనున్నారన్నారు.


స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన సీపీ

వరంగల్ సిటీ, మే 23: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ఏనుమాముల మార్కెట్‌లోని స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను అకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రతను, విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పనితరును పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్, ఏనుమాముల సీఐ పులి రమేష్ ఉన్నారు.

నిలిచిన ప్రగతి

ఎన్నికల కోడ్‌తో పేరుకుపోయిన ప్రజా సమస్యలు

పెండింగ్‌లో ధరణి దరఖాస్తులు

జూన్ 6 తర్వాతే ప్రజావాణి

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

హనుమకొండ కలెక్టరేట్, మే 23: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వలన జిల్లాలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. వరంగల్ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తోపాటు ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో ప్రజల సమస్యలు పేరుకుపోయాయి. లోక్‌సభ ఎన్నికలకు మార్చి 16వ తేదీన ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. అప్పటి నుంచి జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది. జిల్లాకు అభివృద్ధి పనుల నిధులు జూన్ 6 తర్వాతే విడుదల అవుతాయి.

పెండింగ్‌లో దరణి దరఖాస్తులు

ధరణి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు ఉంటే పరిష్కారమయ్యేందుకు ప్రభుత్వం ఎన్నికల ముందు స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అయితే కోడ్ కారణంగా ప్రత్యేక దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లకు తాత్కాలికంగా విశ్రాంతి ఇచ్చి సిబ్బందిని లోక్‌సభ ఎన్నికల విధులకు వాడుకున్నారు. రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం ధరణిలోని పలు నిబంధలను సవరిస్తున్నారు. గ్రీవెన్స్ ఆన్‌ల్యాండ్ మ్యాటర్స్(జీఎల్‌ఎం) ద్వారా వచ్చిన దరఖాస్తులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రజావాణి జూన్ 6 తర్వాతే..

కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న జూన్ 6వ తేదీ వరకు నిలిపివేశారు. ఈ ప్రజావాణిలో వివిధ సమస్యలను ప్రజలు నేరుగా కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టరేట్‌లకు విన్నవించేవారు. ఈ కార్యక్రమానికి వస్తే మా సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు ఎంతో ఆశతో వచ్చేవారు. సమస్యలపై కొందరు ప్రజలు కలెక్టరేట్‌కు రోజు వస్తున్నప్పటికీ కలెక్టర్ కలవకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మూడు నెలల నుంచి ప్రజావాణి కార్యక్రమం రద్దు కావడంతో వివిధ సమస్యలపై ప్రజావాణికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య తీవ్రంగా ఉన్న ప్రజలు కలెక్టర్‌ను కలవడానికి సోమవారం కాకుండా వేరే రోజు వచ్చినప్పటికీ కలెక్టర్ కలవకపోవడంతో తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రజావాణి ద్వారా ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించే మంచి అవకాశం కల్పించినప్పటికీ లోక్‌సభ ఎన్నికల కోడ్ వల్ల సమస్యలు పరిష్కారం కాలేకపోతున్నాయని కొందరు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తనిఖీ నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి బృందం సభ్యులు

నకిలీ కంటి ఆస్పత్రిలో తనిఖీలు

వరంగల్ మెడికల్, మే 23: తెలంగాణ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ మహేశ్‌కుమార్ ఆదేశాల మేరకు వరంగల్ పట్టణంలోని జేపీఎన్‌రోడ్‌లోని డెక్కన్ ఆప్టికల్స్‌లో డాక్టర్ నరేశ్‌కుమార్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి బృందం గురువారం తనిఖీ లు నిర్వహించింది. ఆప్టోమెట్రిలో డిప్లొమా చేసిన ఎం.జనార్దన్.. అందులో డాక్టర్లుగా వ్యవహరిస్తూ కంటి చూపు సంబంధించిన పరీక్షలు చేయడంతోపాటు డాక్టర్‌గా ప్రిస్క్రిప్షన్‌పై మందులు, కంటి చుక్కల మందులు రాస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తనిఖీ నివేదికను హైదరాబాద్‌లోని రాష్ట్ర వైద్య మండలికి పంపనున్నారు. డిప్లొమా ఆప్టోమెట్రీ చేసినవారు డాక్టర్ కాదని, మందులు రాయకూడదని తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ సూచించారు. తనిఖీ బృందంలో వరంగల్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా, వరంగల్ హెచ్‌ఆర్‌డీఏ కోశాధికారి డాక్టర్ శివ్వా సృజన్, అనంతుల అన్వేష్ ఉన్నారు.

రోలర్‌లో పడి కార్మికుడి మృతి


మృతిచెందిన మంజునాథ్‌యాదవ్

గీసుగొండ, మే 23: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని గణేషా ఎకోటెక్ కంపెనీలో పీఎస్‌ఎఫ్ రోలర్‌లో పడి మంజునాథ్‌యాదవ్(23) అనే కార్మికుడు మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం. ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్ పట్టణం రసూల్‌పూర్‌కు చెందిన మంజునాథ్ యేడాదిగా గణేష్ ఎకోటెక్‌కంపెనీలో పీఎస్‌ఎఫ్ రోలర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా ప్లాస్టిక్ దారాలు రోల్ అవుతున్నప్పుడు ఎక్కడైనా చిక్కులుపడి చుట్టుకుంటే వాటిని సరిచేస్తుంటాడు. బుధవారం అర్ధరాత్రి రోలర్‌లను ఆపరేట్ చేస్తూ చిక్కుపడిన దారాలను కట్ చేస్తుండగా చేయి రోలర్‌లోకి లాక్కోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మంజునాథ్‌ను 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ విషయాన్ని యాజమాన్యాన్ని వివరణ కోరగా మృతి చెందినది వాస్తవమేనని, మృతుడి కుటుంబీకులకు సమాచారాన్ని అందించినట్లు పేర్కొంది. యూపీ నుంచి వారు రావటానికి ఫ్లైట్ టికెట్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. మృతదేహాన్ని ఎంజీఎంలో భద్రపరిచారు. కాగా, బుధవారం ఉదయం కార్మికులను తీసుకువచ్చే మినీబస్ ఢీకొని గణేషా కంపెనీలో పనిచేసే కార్మికుడు ఏనుగల్ గ్రామానికి చెందిన జిలానిపాషకు గాయాలయ్యాయని తెలిపారు. అతడిని కూడా చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించారు. అయితే కంపెనీలో పనిచేసే వారందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, మే 23: దామెర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంఠాత్మకూరు ప్రాంతంలో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. గురువారం నిర్వహించిన దాడిలో రూ.50వేలనగదు, ఐదు మోటార్ సైకిళ్లు, ఏడు స్మార్ట్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐలు రవికుమార్, దయాకర్‌లు ధ్రువీకరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు షాకివ్వాలి

పట్టభద్రులపై రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

జనగామ, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా షాకివ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. ఖమ్మం పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో జనగామలో ఆయన కాసేపు ఆగారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్, ఆరు నెలలుగా కాంగ్రెస్ పార్టీ ప్రజలను అన్ని రకాలుగా మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ఏ హామీ అమలుపై కూడా కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి ఆగస్టుకు వాయిదా వేశారని రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. రుణమాఫీ చేయకపోవడంవల్ల బ్యాంకులు కొత్తగా రుణాలను ఇవ్వడం లేదన్నారు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటేనని, వాటి డీఎన్ఏ కూడా ఒక్కటేనని కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పోయి కాంగ్రెస్ వస్తే మార్పు వస్తుందని ప్రజలు భావించారని, అయినా ఏ మార్పు రాలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా అయిందని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పీడ విరగడ కావాలని కాంగ్రెస్‌కు ఓటేస్తే.. ఆపార్టీ కూడా బీఆర్‌ఎస్ బాటలోనే పోతోందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీతో హామీలు ఇప్పించి ప్రజలు, రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులను రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారన్నారు. దేవుళ్ల పేరు మీద ఒట్లు వేస్తూ ప్రజలను ముంచుతున్నారని మండిపడ్డారు. వడ్లకు బోనస్ ఇస్తానని చెప్పి కేవలం సన్న వడ్లకే అని మాట మార్చడం ఏంటని ప్రశ్నించారు. సన్న, దొడ్డు తేడా లేకుండా అన్ని రకాల వడ్లను కొనడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నప్పటికీ బోనస్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వానికి నొప్పి ఏంటని నిలదీశారు. బోనస్ నుంచి తప్పించుకోవడానికి ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్నరకాన్ని ప్రోత్సహించాలనుకుంటే అవసరమైతే క్వింటాకు రూ. 1000 బోనస్ ఇవ్వాలని, కానీ ఇచ్చిన మాట ప్రకారం దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు కరవు భత్యాన్ని ఎప్పటికప్పుడు చెల్లిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం నాలుగు డీఏలను చెల్లించలేదని కిషన్‌రెడ్డి అన్నారు. ఉద్యోగుల డీఏ, పీఆర్‌సీ పెండింగ్, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌పై కాంగ్రెస్ సర్కారుకు పట్టింపు లేకుండా పోయిందని అన్నారు. గత ప్రభుత్వ పథకాలను అమలు చేస్తారా, తొలగిస్తారా అన్న దానిపై స్పష్టత లేదని అన్నారు. ఆర్థిక వనరులను ఎలా సమకూర్చుంటారన్న దానిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక అవగాహన అంటూ లేదని, ఇలాగే కొనసాగితే రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా బీజేపీని గెలిపించాలని కోరారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత పట్టభద్రులు, మేధావులు, ఉద్యోగులపై ఉందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి, ఉడుగుల రమేశ్, సౌడ రమేశ్, మహంకాళి హరిశ్చంద్రగుప్త, శివరాజ్‌యాదవ్, కొంతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎం అభివృద్ధిపై రోజూ సమీక్ష

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఎంజీఎం ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ మెడికల్, మే 23: పేదల ఆస్పత్రి ఎంజీఎం అభివృద్ధిపై లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రతీ రోజు ఒక గంట కేటాయిస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. 'పెద్ద ఆస్పత్రికి నిర్లక్ష్యపు జబ్బు' అనే కథనం గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి స్పందించారు. గురువారం ఉదయం ఎంజీఎంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఎంజీఎం పనితీరు మెరుగుపర్చేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఎంజీఎంలో పరికరాల మరమ్మతు కోసం ఆయా సంస్థ ప్రతినిధులు స్పందించకపోతే పోలీసు కేసు నమోదు చేయాలని సూచించారు. ఎంజీఎం ఆస్పత్రిపై కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన పాపాలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు గంటలు కరెంట్ పోతేనే గగ్గోలు పెడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు.. కేసీఆర్ వరంగల్‌లో మకాం వేసి ఇచ్చిన హామీలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. ఆ హామీలు నెరవేర్చనందుకే వారిని ప్రజలు తిరస్కరించారని అన్నారు. ఎంజీఎం ఆస్పత్రి ఉద్యోగులు కూడా స్నేహపూర్వక వాతావరణంలో విధులు నిర్వహిస్తూ నిర్లక్ష్యాన్ని పక్కనపెట్టాలని నాయిని విజ్ఞప్తి చేశారు.

అంతకుముందు ఎమ్మెల్యే నాయిని ఓపీ బ్లాక్ పరిశీలించి అక్కడ నుంచి రక్తనిధి కేంద్రానికి చేరుకున్నారు. రక్తనిధి కేంద్రంలో మూలనపడ్డ ప్లేట్‌లెట్ సపరేట్ మిషన్ ఎందుకు బాగు చేయడం లేదని ప్రశ్నించారు. మార్చురీలో దుర్గంధం రావడంపై ప్రశ్నించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కూడా అసౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. కొన్ని ల్యాబ్ పరీక్షలను బయటికి పంపిస్తున్న దృశ్యాన్ని స్వయంగా గమనించారు. రేడియాలజీ విభాగంలో రెండు ఎక్స్‌రే మిషన్లు పనిచేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఆర్ఎంలు డాక్టర్ మురళి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం అడ్డగోలు హామీలిచ్చి ఆగం చేస్తున్నాడు..

ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్



మీడియాతో మాట్లాడుతున్న అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

హనుమకొండ టౌన్, మే 23: శాసన సభ ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు లక్షల కోట్లు ఖర్చు అయ్యే హామీలిచ్చి సీఎం అయ్యాక అమలుపరచకుండా ప్రజలను రేవంత్‌రెడ్డి ఆగం చేస్తున్నాడని బీజేపీ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం హనుమకొండ హంటర్‌రోడ్డులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన పార్టీ ఒకటైతే.. 10 యేళ్ల అధికారంలో ఉండి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దిగజార్చిన పార్టీ మరొకటని దుయ్యబట్టారు. నిరంతరం ప్రజల పక్షాన కొట్లాడే బీజేపీ పార్టీని పట్టభద్రుల ఎన్నికల్లో ఆదరించాలని ప్రజలను కోరారు.

కాంగ్రెస్ అధికారంలో రాగానే డిసెంబర్ 9న ఆరు గ్యారంటీలను అమలు చేస్తానని ఘంటాపథంగా చెప్పిన రేవంత్‌రెడ్డి.. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఏ విధంగా మాట మార్చాడో ప్రజలందరికీ తెలుసన్నారు. ప్రశ్నించే గొంతుకను ఆదరించండని కాంగ్రెస్ అభ్యర్థి చెబుతున్న మాటలు ఎలా నమ్మాలని ప్రశ్నించారు. అధికార పార్టీ అభ్యర్థి అయి ఉండి ప్రభుత్వాన్ని ఎలా ప్రశ్నిస్తాడని అన్నారు. మా తప్పులను బయటకు తీయకండి.. మీ తప్పులను ఎత్తిచూపం.. అని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఒప్పందం కుదుర్చుకున్నాక ఆ పార్టీల అభ్యర్థులను శాసన మండలికి పంపిస్తే సమస్యలపై ఎలా ప్రశ్నిస్తారనేది మేధావులు ఆలోచన చేయాలన్నారు. శాసనసభలో 8మంది బీజేపీ ఎమ్మెల్యేలు అధికార పార్టీని సమస్యలపై ఎలా నిలదీస్తున్నారో.. అదే రీతిలో శాసనమండలిలో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ప్రశ్నిస్తారన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు రెండూ ఒక్కటేనని, పట్టభద్రులను ఓటు అడిగే నైతిక హక్కు ఆ పార్టీలకు లేదని విమర్శించారు. 10 యేళ్లలో బీఆర్‌ఎస్ భూములు, మద్యం అమ్ముకొని ఖజానా నింపుకుంటే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పని చేస్తోందని ఎద్దేవా చేశారు. ఆరు నెలల్లో కాంగ్రెస్ పార్టీ రూ.14,000కోట్ల అప్పు చేసిందని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబం దోచుకుంటే.. కాంగ్రెస్ హయాంలో ప్రతీ మంత్రి దోచుకొని దాచుకుంటున్నారన్నారు. దోచుకున్న దాంట్లో కొంత ఢిల్లీకి పంపిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రెండు ఉపఎన్నికలు వచ్చాయని, కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ మటుమాయమవుతుందని, కాంగ్రెస్ ఓడిపోతుందని జోస్యం చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం అవే ఫలితాలు వస్తాయని స్పష్టం చేశారు. పెద్దల సభలో బ్లాక్ మెయిలర్‌కు అవకాశం ఇవ్వొద్దని, నీతి, నిజాయితీతో 40 యేళ్లగా నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న ప్రేమేందర్‌రెడ్డిని మేధావులు ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, మురళీధర్, నరోత్తమ్ రెడ్డి, కొండి జితేందర్‌రెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో విద్యుత్ అధికారుల పరిశీలన

ఎంజీఎం ఘటనతో చలనం



ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా గురించి తెలుసుకుంటున్న ఎస్ఈ వెంకటరమణ

హనుమకొండ టౌన్, మే23: ఎంజీఎం ఆస్పత్రిలో మంగళవారం నిలిచిపోయిన విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో ఎన్పీడీసీఎల్ అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉన్న ప్రసూతి ఆస్పత్రులు, పీహెచ్‌సీ కేంద్రాలు, వివిధ ప్రత్యేక విభాగాలను ఏఈ స్థాయి నుంచి ఎస్ఈ స్థాయి అధికారుల వరకు కేటగిరీలుగా విడిపోయి సందర్శించారు. ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్యులతో మాట్లాడి అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్స్, జనరేటర్లను పరిశీలించి వాటి మెయింటెనెన్స్ కోసం తీసుకోవాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ముందుస్తుగానే తమ దృష్టికి తీసుకరావాలని పేర్కొన్నారు.

ప్రభుత్వానికి అందిన 'ఎంజీఎం' నివేదిక

వరంగల్ మెడికల్, మే 23: ఈనెల 21న వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో ఏర్పడిన విద్యుత్తు అంతరాయంపై ప్రభుత్వం ఆదేశించిన విధంగా నివేదికను అందించినట్లు ఎంజీఎం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. కరెంటు అంతరాయంపై ఎన్పీడీసీఎల్ బృందం లైన్‌లను తనిఖీ చేసిందన్నారు. బ్రేకర్లో లోపం ఉందని, ప్రధాన సబ్‌స్టేషన్‌కు హెచ్‌టీ లైన్ జంపర్లు లూజ్ కాంటాక్ట్‌లు ఉన్నాయని ఆయన తెలిపారు. ఔట్ పేషెంట్ బ్లాక్‌లకు సరఫరా చేసే ఇతర సబ్ స్టేషన్ లైన్లలో ఎటువంటి లోపం లేదని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. ఔట్ పేషెంట్‌లకు సరఫరా చేసే సబ్‌స్టేషన్ లైన్లకు సరఫరాను పునరుద్ధరించి ఆపై హెచ్‌టీ లైన్ జంపర్లను రిపేర్ చేసి విద్యుత్ సరఫరా అందించారని నివేదికలో పేర్కొన్నట్లు తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రిలోని జనరేటర్లపై అత్యవసర ప్రాంతాలైన ఎమర్జెన్సీ, ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, ఎంసీహెచ్ వార్డులకు విద్యుత్ సరఫరాను అందించామని తెలిపారు. రోగుల సంరక్షణకు ఎలాంటి అసౌకర్యాల కలగలేదని రామ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

మృతుడు భూపాలపల్లి జిల్లా వాసి



ఆత్మహత్య చేసుకున్న బర్ల హరీష్ (20)

రఘునాథపల్లి, మే 23: చెట్టుకు ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని గోవర్ధనగిరి గ్రామ శివారులో వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన గురువారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి మండలం నేరేడుపల్లి గ్రామానికి చెందిన బర్ల హరీష్ (20) అనే యువకుడు తన తండ్రి బర్ల సదయ్యతో వరి ధాన్యం పట్టించే విషయంలో గొడవ పడి బుధవారం తన మోటారు సైకిల్‌పై ఇంటి నుంచి వెళ్లాడు. మోటారు సైకిల్‌పై ఇంటి నుంచి బయలుదేరిన హరీష్ తండ్రితో జరిగిన గొడవతో మనస్తాపానికి గురై మండలంలోని గోవర్ధనగిరి గ్రామ శివారులోని దొంతుల సమ్మయ్య వ్యవసాయ భూమి వద్ద ఉన్న చింత చెట్టుకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు గురువారం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, ఇతర ఆధారాలతో భూపాలపల్లి జిల్లా వాసిగా గుర్తించి మృతుడి బంధువులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలంలో ఉన్న మోటారు సైకిల్‌లో ఒక బీరు బాటిల్‌తో పాటు రెండు రకాల పురుగుల మందు డబ్బాలు ఉన్నాయి. మృతుడి బంధువుల ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి బలవన్మరణం

జనగామ కల్చరల్, మే 23: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కాజీపేటకు చెందిన రౌతు దయాకర్ (47) కాజీపేట లోకోషెడ్‌లో డీజిల్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. తాగుడుకు బానిసై, మానసిక వేదనతో గురువారం జనగామ రైల్వేస్టేషన్‌లో ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపు వెళ్లే గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల నుంచి దరఖాస్తు తీసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. జనగామ జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ ఆర్.రమణారెడ్డి, కానిస్టేబుల్ సీహెచ్.నరేష కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ఐటీ'లో ఇష్టారాజ్యం



బల్దియాలో ఐటీ విభాగం కార్యాలయం



ఔట్‌సోర్సింగ్ గుప్పిట్లో బల్దియా సాంకేతిక విభాగం

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనే కార్పొరేషన్ డాటా

కార్పొరేషన్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

వరంగల్ కార్పొరేషన్, మే 23: వరంగల్ నగర పాలక సంస్థ సాంకేతిక విభాగాన్ని బల్దియా ఉన్నతాధికారులు గాలికి వదిలేసినట్టు తెలుస్తోంది. ఐటీ విభాగంతో పాటు దానికి అనుబంధంగా పనిచేస్తున్న ఈ- సేవా కేంద్రాల్లో అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. వరంగల్ నగర పాలక సంస్థకు సంబంధించిన పన్నులు, పథకాలు, నిర్మాణాలు, సిబ్బంది పూర్తి వివరాలు, లెక్కలు, బిల్లులు, రాబడి, పోబడి అంతా ఐటీ విభాగంలో నిక్షిప్తమై ఉంటుంది. అయితే చాలా కాలంగా కార్పొరేషన్ ఐటీ విభాగానికి ప్రభుత్వ అధికారి పర్యవేక్షణ బాధ్యత లేకుండాపోయింది. బల్దియా శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, మలేరియా, హార్టికల్చర్, వెటర్నరీ విభాగాలను అధికారులు సమర్థవంతంగా నడిపిస్తున్నారు. కానీ బల్దియా ఐటీ విభాగాన్ని మాత్రం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నడిపిస్తుండడం విస్మయానికి గురి చేస్తోంది. అధికారుల పర్యవేక్షణ కరువవడంతో అక్కడి సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా నడుస్తోంది. ఉదయం వచ్చి బయోమెట్రిక్ హాజరు వేసుకున్న తర్వాత కంటికి కనిపించకుండా పోతారనే ప్రచారం ఉంది.

ఇష్టారాజ్యం

నగర పాలక సంస్థ ఐటీ విభాగంలో 14 యేళ్లుగా ప్రైవేటు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రాజ్యమేలుతున్నారు. ఈ శాఖలోకి మరే ప్రభుత్వ అధికారి చొరబడకుండా గత కమిషనర్, మేయర్లను తప్పుతో వప ట్టించి ఐటీ శాఖను గుప్పిట్లో పెట్టుకున్నట్టు ఆరోపణలున్నాయి. ఇక్కడ సిబ్బందిని తొలగించాలన్నా, నియమించుకోవాలన్నా ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చేతుల్లో ఉందని తెలుస్తోంది. అంతేకాకుండా కార్పొరేషన్ పరిధిలో కంప్యూటర్‌లకు సంబంధించిన పరికరాలు కొనుగోలు చేయాలన్నా.. ఆయన కనుసన్నల్లోనే ఉంటుందని సమాచారం. ఈ క్రమంలో నాసిరకం సామగ్రి కొనుగోలు చేసి నకిలీ బిల్లులు సృష్టిస్తున్నట్లు కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ శాఖపై ఔట్ సోర్సింగ్ వ్యక్తి పెత్తనం సాగుతుండడంతో అలాగే బల్దియాలో డాటా సైబర్ నేరస్తుల చేతికి వెళ్లడంతో పాటు అక్రమాలు జరిగే ప్రమాదం ఉంది. ఇంకా కార్పొరేషన్‌కు సంబంధించిన పూర్తి డాటాను ఓ వ్యక్తి బయటి వ్యక్తులకు, సైబర్ నేరగాళ్లకు చేరవేస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇక్కడ జరుగుతున్న అక్రమాలను తెలుసుకున్న హైదరాబాద్ ఐటీ అధికారులు.. వరంగల్ బల్దియా డాటా, పాస్‌వర్డ్‌ను వారి వద్ద భద్రపరిచినట్టు సమాచారం.

కమిషనర్ దృష్టి సారించాలి..

నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కొనసాగుతున్న ఐటీ విభాగాన్ని పర్యవేక్షించేందుకు, అక్కడ పని చేసే ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నడిపించేందుకు ఓ ప్రభుత్వ ఉన్నతాధికారిని నియమించాల్సిన అవసరం ఉంది. బల్దియా ఐటీ విభాగం అదుపు తప్పకుండా ఉండాలంటే ఉన్న ఉద్యోగులపై ఒక ప్రభుత్వ పర్యవేక్షణ అధికారి ఉండాలని కొందరు సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. కనీసం సూపరింటెండెంట్ స్థాయి అధికారి పర్యవేక్షణ ఉన్నా.. ఇక్కడ జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో కమిషనర్ దృష్టి సారించాలని నగర పౌరులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అడ్డదారిలో నియామకాలు

గ్రేటర్ నగర పాలక సంస్థలో గతంలో ముగ్గురు మాత్రమే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఐటీ విధులు నిర్వర్తించే వారు. కానీ 2020లో అప్పటి పాలక వర్గంలో ఓ నేత కొందరు వ్యక్తులను చేరదీసి కంప్యూటర్ శిక్షణ ఇప్పించాడు. 8 మంది నిరుద్యోగుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు దండుకోవడంతో పాటు ఇన్స్యూరెన్స్ పేరుతో మరికొంత డబ్బు తీసుకుని ఐటీలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా పెట్టించాడని తెలిసింది. ఇంకా శానిటేషన్ విభాగంలో పీహెచ్ (ఫిజికల్ హెల్త్) వర్కర్ల కొరత ఉందని 452 మందిని అడ్డదారిలో చేర్చుకున్నారు. వారిలో కొందరు శానిటేషన్ పనులు చేపట్టకుండా ఐటీతో పాటు ఈ-సేవా కేంద్రాల్లో ఆపరేటర్లుగా, బిల్ కలెక్టర్లుగా పని చేస్తూ పని తప్పించుకుంటున్నారు. దీంతో శానిటేషన్ సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. అయితే ఈ-సేవల్లో పని చేసే సిబ్బందికి నెలకు వచ్చే జీతాలతో పాటు ట్యాక్సీలు చెల్లించడానికి వచ్చిన వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు ప్రజలు వెల్లడించారు.



అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కేయూలో మెస్ మూసివేయొద్దని పీడీఎస్‌యూ విద్యార్థుల ఆందోళన

వరంగల్ ఎడ్యుకేషన్, మే 23: కాకతీయ యూనివర్సిటీలోని మెస్సులను మూసివేయాలని హాస్టల్స్ డైరెక్టర్ సర్క్యులర్ జారీ చేయడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆందోళనకు దిగింది. గురువారం కేయూలోని అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ముందు విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భగా సంఘం వర్సిటీ కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ... త్వరలో గ్రూప్స్, డీఎస్సీతో పాటు అనేక రకాలైన పోటీ పరీక్షలు జరుగున్న నేపథ్యంలో హాస్టళ్లను మూసివేస్తాననడం తగదన్నారు. మెస్‌ను మూసివేస్తామన్న సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పరిపాలన భవనాన్ని ముట్టడించి రిజిస్ట్రార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వచ్చిన హాస్టల్స్ డైరెక్టర్ సమ్మయ్య హాస్టల్స్‌ని మూసివేయమని హామి ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వినయ్, రాజు, శ్రవణ్, అర్జున్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కామర్స్‌లో సంజీవ్‌కు డాక్టరేట్



వరంగల్ ఎడ్యుకేషన్, మే 23: కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పరిశోధకుడు ఎన్.సంజీవ్‌కు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మహ్మద్ ముస్తాఫా గురువారం డాక్టరేట్‌ను ప్రకటించారు. ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి పర్యవేక్షణలో 'ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ ఇండియా - ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టు తెలంగాణ స్టేట్ అనే పరిశోధన పత్రం సమర్పించినందుకు గాను నవీన్‌కు డాక్టరేట్‌ను ప్రకటించారు.

జయప్రకాశ్ క్రికెట్ ట్రోఫీ విజేత జనగామ



విజేత జనగామ జిల్లా జట్టుతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, మే 23: మూడురోజులుగా ఎల్‌బీ కాలేజీలో నిర్వహిస్తున్న జయప్రకాశ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటులో గురువారం జరిగిన జనగామ వర్సెస్ ములుగు జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోరులో 79 పరుగులతో జనగామ జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ క్రికెట్ పోటీల్లో ఫైనల్‌లో జరిగిన జనగామ, ములుగు మధ్య జరిగిన ఫైనల్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జనగామ జట్టు నిర్ణీత 20 ఓటర్లకు గాను 7 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ చేసింది. జనగామ జట్టు ఓపెనర్ ప్రదీప్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో కేవలం 42 బంతులు ఎదుర్కొని ఒక సిక్స్, 9 బౌండరీల సాయంతో 58 పరుగులు జట్టు విజయంలో కీలక భూమిక పోషించాడు. తదుపరి బరిలోకి దిగిన ములుగు జిల్లా జట్టు 20 ఓవర్లు ఎదుర్కొని 10 వికెట్ల నష్టానికి 126 పరుగులు మాత్రమే చేసి 79 పరుగుల తేడాతో ఓటమి పాలయింది.

కాగా, జనగామ జిల్లా జట్టు బౌలర్ అనురీత్ నాలుగు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపిక అయ్యాడు. మూడు రోజులు నాకౌట్ పద్ధతిలో జరగుతున్న క్రీడా పోటీలో క్రీడాకారులు నువ్వా నేనా అన్న తీరుగా పోటీతత్వాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇక్కడ జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 24 నుంచి 29 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న అంతర్ జిల్లాస్థాయి బాలుర టీ 20 సీనియర్స్ క్రికెట్ విభాగంలో పాల్గొననున్న క్రీడాకారులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ ప్రవేశాలను ప్రోత్సహించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 23: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలను ప్రోత్సహించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కేయూలోని కమిటీ హాల్‌లో కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్మోహన్‌రాజుతో పాటు బోధన సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాగానే కొత్తగూడెం కళాశాలను మొదటి ప్రాధాన్యత క్రమంలో మొదటి ఎంపికగా ఉండే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఇందుకోసం విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కళాశాలలో ఉన్న మౌలిక వసతులు, ల్యాబ్‌లు, ఫ్యాకల్టీ ఇతరత్ర వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యను తగ్గకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎం. సదానందం, డీన్ అకడమిక్ ఆడిట్ ప్రొఫెసర్ హనుమంతు, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సంచాలకులు ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు మహ్మద్ హబీబుద్దీన్, డాక్టర్ కోల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు

జనగామ కల్చరల్, మే 23: బోధిసత్వ గౌతమ బుద్ధుడి 2568వ జయంతిని పురస్కరించుకొని జిల్లాలో బుద్ధపూర్ణిమ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గద్దల కిషోర్, పైసా రాజశేఖర్ మాట్లాడుతూ బుద్ధుని బోధనలతో సామాజిక రుగ్మతలు రూపుమాపారన్నారు. పరిశీలన, ప్రయోగాలతో వాస్తవ, భౌతిక, యదార్థ విషయాలను హేతుబద్ధంగా వివరించారన్నారు. కార్యక్రమంలో నాయకులు చుంచు రాజు, సందెన రవీందర్, గంధమల్ల ఉదయ్‌కిరణ్, నీర్మాల భాస్కర్, గువ్వల రవి, గుర్రం శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సిద్ధంగా ఉంచాలి

జడ్పీ సీఈవో అనిల్‌కుమార్

నర్మెట, మే 23 : నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచుకోవాలని జడ్పీ సీఈవో, ఇంచార్జి డీపీవో అనిల్‌కుమార్ సూచించారు. గురువారం నర్మెట మండలకేంద్రంలో నర్సరీని, పల్లె ప్రకృతి వనాన్ని, క్రీడా ప్రాంగణం, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్‌లను పరిశీలించారు. వీటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం సందర్భంగా వర్షాలు పడుతుండడంతో రోడ్డుకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాలల్లో మొక్కలు లేని చోటీ మొక్కలు నాటడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరవింద్‌చౌదరి, కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ రాజయ్య



పాంనూర్‌లో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, మే 23: ఒక బ్లాక్‌మెయిలర్ పీడను వదిలించుకోవడానికే కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చిందని మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ తెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలుచున్న ఏనుగు రాకేష్ రెడ్డికి మద్దతుగా మండలంలోని పాంనూర్, నెమలిగొండ, ఇప్పగూడెం, అక్కపల్లిగూడెం, రంగరాయగూడెం గ్రామాలలో గ్రాడ్యు యేట్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు ఒక బ్లాక్‌మెయిలర్‌కు, విద్యావంతుడికి జరుగుతున్న ఎన్నికలన్నారు. జర్నలిస్టు ముసుగులో అనేక అక్రమాలకు దందాలకు పాల్పిడిన చీటర్ మల్లన్న అన్నారు. ఒక చీటర్ అని తెలిసికూడ మల్లన్నకు ఓటు వేస్తే మోరిలో ఓటు వేసినట్లేనని తెలిపారు. నిరుద్యోగులు, ఉద్యోగుల కోసం మండలిలో గొంతు విప్పి అధికార పార్టీ మెడలు వంచే వ్యక్తి రాకేష్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ పట్టభద్రులు గత 10ఏళ్లలో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయా ల్సిన అవసరం ఉందన్నారు. ఓటు వేయాలని ఓటర్లు దగ్గరకు వచ్చే కాంగ్రెస్ నాయకులను, కడియంను పట్టభద్రులు నిలదీయాలన్నారు. మహిళలక్ష్మి పథక ంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలు నరకం చూస్తున్నారన్నారు. బస్సులు పెంచకుండా ట్రిప్పులు పెంచకుండా ఉచిత ఆర్టీసీ ప్రయాణం ఏర్పాటు చేసి మహిళలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇనుగాల సంపత్ రెడ్డి, కనకం గణేష్, ఒగ్గు రాజు, పొన్న యాకయ్య, రాజేష్‌ఖన్నా, సురేందర్ రెడ్డి,కలకోల నరేందర్, శివ, ఎమ్డీ అన్వర్‌పా షా, వెన్న కూస రాంనర్సయ్య, టి.సురేష్, గుండె మల్లేషం, వట్టే రత్నాకర్ రెడ్డి, ఆకుల నర్సింహులు, బొంకూరి మహేష్, కృష్ణారెడ్డి, నాగపూరి పావని పాల్గొన్నారు.

మోసకారి కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలి

రఘునాథపల్లి : ఖమ్మం, నల్గొండ,వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ రవిశంకర్, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని ఖిలాషాపూర్ గ్రామంలో గురువారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వారాల రమేష్ అధ్యక్షత వహించగా, మాజీ ఎమ్మెల్యేలు రవిశంకర్, తాటికొండ రాజయ్య హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని, బీఆర్ఎస్‌కు ద్రోహం చేసిన కడియం శ్రీహరికి కర్రు కాల్చి వాత పెట్టాలని అన్నారు. పార్లమెంటు, ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం రావడం ఖాయమని, కాంగ్రెస్ మోసాలను ప్రజలు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారని, కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. సమావేశంలో వైకుమార్ గౌడ్, గూడ కిరణ్ కుమార్, జిట్టే వీరస్వామి, ముప్పిడి శ్రీనివాస్, కావటి యాదగిరి, కొడిదేటి శంకర్, కావటి రాజయ్య, మడ్లపల్లి సునీత, తిప్పారపు రమ్య, శివరాత్రి రాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

చిలుపూర్, మే 23 : వ్యవసాయ పొలాలకు వెళ్ళేందుకు గాను తలెత్తిన బాట పంచాయతీ విషయంలో పరస్పరం ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డ సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన మోటం అబ్బసాయిలు, అతడి కుమారుడు శ్రీశైలంతో పాటు, అదే గ్రామానికి చెందిన మోటం శేఖర్‌కు గ్రామ సమీపంలోని ఏనె ఏరియా వ్యవసాయ భూములు ఉన్నాయి. పొలాలకు వెళ్ళే బాట విషయంలో ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో బుధవారం మాటామాటా పెరిగి పరస్పరం భౌతిక దాడులకు దిగారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, మే 23: కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి జే.జయంతి గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇటీవల ఎస్ఎస్సీలో జీపీఏ 7.0 ఆపైన సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనారిటీ విద్యార్థులు ఈ నెల 30వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకో వాలన్నారు. కార్పొరేటు కళాశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు, నవోదయ పాఠశాలలు, తెలంగాణ ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీ లలో చదివిన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు.

పట్టభద్రుల ఎన్నికల్లో మల్లన్నకు పట్టం కట్టాలి

లింగాలఘణపురం, మే23: గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని టీయూటీఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షుడు బుర్ర రమేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం లింగాలఘణపురం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు తీన్మార్ మల్లన్నకు జనగామ జిల్లా శాఖా సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని తెలిపారు. టీయూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి నిమ్మ భగవాన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రావుల వెంకటేశ్వర్లుగౌడ్, రాష్ట్ర కార్యదర్శులు లకావత్ ఈర్యానాయక్, రేణుకు ంట్ల మురళి, కేమిడి భాస్కర్, భీమా, లక్ష్మణ్ గౌడ్, గోవర్ధన్, వేణుగోపాల్, దేవానాయక్, శివలింగం, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

● జనగామ కల్చరల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నకు పట్టం కట్టాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు బుర్ర రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నిమ్మ భగవాన్‌రెడ్డి గురువారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మేధావులు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ పట్టభద్రులు ఓటు వేయాలని కోరారు.

ఆసుపత్రి జనరేటర్ల తనిఖీ

జనగామ కల్చరల్, మే 23: జనగామ జిల్లా కేంద్రం లోని జనరల్ హాస్పిటల్, ఎంసీహెచ్‌ను ఆపరేషన్స్ ఎస్ఈ వేణుమాధవ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌పీడీఎస్ఎల్ నుంచి అయ్యే విద్యుత్ సరఫరా, మెడికల్ డిపార్ట్‌మెంట్ ప్రొవైడ్ చేసిన జనరేటర్లను స్టాండ్ బై తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా జనరల్ హాస్పిటల్‌లో ఉన్న లోడు కారణంగా 50 కేవీ జనరేటర్ స్థానంలో 125 కేవీ జనరేటర్‌ను ఏర్పాటు చేయాలని, హాస్పిటల్ లోపల మెట్ల వద్ద కంట్రోల్ ప్యానెల్ ఉంది, అది పేషెంట్స్‌కు తగలకుండా సేఫ్టీ ఫెన్సింగ్ చేయించాలని హాస్పిటల్ సూపరి ంటెండెంట్ అనురాధకు సూచించారు. మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్‌లో కూడా జనరేటర్‌కు ఆటో స్టార్టర్ పెట్టుకోవాలని, కేబుల్ స్టాండ్‌బై ప్రొవైడ్ చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ మధుసూధన్‌రెడ్డికి సూచిం చారు. కార్యక్రమంలో జనగామ డీఈ, ఏడీఈ, పెంబర్తి ఏఈ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి



వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి, మే 23 : ఐకేపి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న వరి ధాన్యంను వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని తాజా మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఖిలాషాపూర్ గ్రామంలోని ఐకేపి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యంను ఆయన గురువారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో రోజుల తరబడి ఉంటున్న వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడం వల్ల వర్షాలకు తడిసి ముద్దగా మారి మొలక వస్తుందని రైతులు మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు రోదిస్తూ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ రైతులకు సకాలంలో బర్దాన్‌లు అందించకపోవడంతో కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరి ధాన్యంను సకాలంలో కొనుగోలు చేశామని, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. రైతుల పట్ల ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడనాడకుంటే రైతులకు సరైన న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో వారాల రమేష్, ముప్పిడి శ్రీనివాస్, కావటి యాదగిరి, శంకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించాలి

జనగామ డీఆర్‌డీవో మొగులప్ప



జఫర్‌గడ్‌లో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో మొగులప్ప

జఫర్‌గడ్, మే 23 : హరితహారం కింద ఆయా గ్రామాల్లో మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించాలని జనగామ డీఆర్‌డీఓ మొగులప్ప జీపీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. గురువారం జఫర్‌గడ్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందిచే సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మొగులప్ప మాట్లాడుతూ హరితహారం మొక్కల సంరక్షణకు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పనికి వచ్చే ప్రతి కూలీకి రోజుకు కనీసం రూ.250లు డబ్బులు వచ్చేలా కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని కల్పించడంలో జఫర్‌గడ్ మండలం ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఇందుకు ఉపాధి ఉద్యోగ సిబ్బందిని ఆయన అభినందిం చారు. ఇదే స్ఫూర్తిని ఇక ముందు కూడా కొనసాగించాలన్నారు. సమావేశానంతరం డీఆర్‌డీఓ మొగులప్ప మండల కేంద్రంలోని విద్యార్థుల యూనిఫాం (దుస్తులు) కుట్టే ప్రదేశాన్ని సందర్శించి పరిశీలించారు. జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న దృష్ట్యా దుస్తులు కుట్టే పనిని పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ సుమన్, ప్లాంటేషన్ మేనేజర్ వీరన్న, ఈజీఎస్ ఏపీఓ రాజకరుణ, ఈసీ రమేశ్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు తగిన గుణపాఠం చెప్పాలి



మచ్చుపహాడ్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్మెట, మే 23 : ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నకు తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ ఉమ్మడి మండల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు చింతకింది సురేష్ అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఎనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ మండల బీఆర్ఎస్ నాయకులు గురువారం మండలకేంద్రంతో పాటు మచ్చుపహాడ్ పలు తండాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనుగుల రాకేష్‌రెడ్డి ఉన్నత విద్యావంతుడు అని విద్యావంతునికి ఓటు వేస్తే నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాడన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఓ బ్లాక్ మెయిలర్ అని అన్నారు. పట్టభద్రులు ఆలోచించి మంచి విద్యావంతుడు రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. జడ్పీ కోప్షన్ ఎమ్డీ గౌస్, నాయకులు నీరటి సుధాకర్, మాజీ సర్పంచ్ రామిని శివరాజు, కిరణ్‌నాయక్, రామలింగం, వస్పరి రాజు, రవి, భాస్కర్, కోనేటి మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

రాకేశ్‌రెడ్డికి మద్దతివ్వాలంటూ విస్తృత ప్రచారం



బండనాగారంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నేతలు

బచ్చన్నపేట, మే 23: పట్టభద్రుల గొంతు వినిపించే ఖమ్మం-వరంగల్-నల్లగొండ జిల్లాల బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటువేసి గెలిపించుకోవాలంటూ గురువారం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు విస్తృత ప్రచారం సాగించాయి. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు ఇచ్చిన హామీల అమలులో విఫలమవుతున్నారని, పట్టభద్రులు గమనించాలని నాయకులు కోరారు. ఆరు మాసాలు గడవకముందే కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి ప్రారంభమైందన్నారు. చట్ట సభల్లో పట్టభద్రుల గొంతు వినిపించాలంటే రాకేశ్‌రెడ్డి గెలిపించుకోవాలని పట్టభద్రుల ఇళ్లకు తిరుగుతూ నాయకులు వేడుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రచార కార్యక్రమాల్లో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షులు ఇర్రి రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ పులిగిల్ల పూర్ణచందర్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షులు గంగం సతీష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు బోడిగం చంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి, వడ్డేపల్లి మల్లారెడ్డి, వడ్డేపల్లి ఉపేందర్‌రెడ్డి, ఎండీ షబ్బీర్, కర్నాల వేణు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పాలకుర్తి, మే 23 : ఈ నెల 19న గోవాలో యూనివర్సల్ 369 షోటోకాన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన పెద్ది హర్షిణి ఉజ్వల్ పాల్గొని పతకాలు సాధించారు. ఈ సందర్భంగా హర్షిణి వెపన్ కటాస్ విభాగంలో బంగారు పతకం సాధించగా, కటాస్ విభాగంలో సిల్వర్ పతకాన్ని సాధించింది. అదే విధంగా ఉజ్వల్ వెపన్ కటాస్ విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించారని గ్రామస్తులు అభినందించారు. ప్రముఖ సినీ నటుడు సుమన్ అభినందించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మాజీ సర్పంచు పార్వతీ, ఎంపీటీసీ కలింగరావు, కారుఎ^ోతుల వేణు, రాజేశ్వరావు చిన్నారి హర్షిణీ, ఉజ్వల్‌లను అభినందించారు..

గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

జఫర్‌గడ్, మే 23 : వరంగల్ -ఖమ్మం -నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు గురువారం మండలంలో ప్రచారం నిర్వహించారు. సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల అయిలయ్య, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ ఎ.బిక్షపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, సొసైటీ మాజీ చైర్మన్ సిహెచ్.కృష్ణమూర్తి, ఇల్లందుల శ్రీనివాస్, తదితర నాయకులు మండలంలోని ఓబులాపూర్, ముగ్దుంతండా, షాపల్లి, తీగారం, సూరారం, హిమ్మత్‌నగర్, తదితర గ్రామాల్లో పర్యటించి పట్టభద్రులను కలిసి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి విజయం చేకూర్చాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ శివయ్య, కాంగ్రెస్ నాయకులు పోరెడ్డి సత్యనారాయణ రెడ్డి, సింగపురం అశోక్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీమంత్రి పరామర్శ



రాములు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల మే 23 : మండలంలోని రామవరం గ్రామానికి చెందిన మేటి రాములు ఇద్దరు కుమారులైన శివ ,శ్రవణ్‌లు ఇటీవల హైదరాబాద్ ఫిర్జాదిగూడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలిసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం ఉదయం వారింటికి వెళ్ళి వారి చిత్రపటాలపై పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. ఆ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండలపార్టీ అధ్యక్షుడు సింధె రామోజీ, ఎంపీటీసీ చెంచు మణెమ్మ రాజిరెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ వైస్‌చైర్మన్ మేటి సోమరాములు, దేశగాని సతీష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్యను పెంచాలి

కొడకండ్ల మే 23 : ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచేలా గర్భిణీ స్త్రీలను చైతన్యపరచాలని జనగామ డీఎంహెచ్‌వో డాక్టర్ హన్స్‌రాజ్ స్థానిక వైద్య సిబ్బందికి సూచించారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిష్టర్లను, కేంద్రంలో, ఆవరణలో పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి ఆ.హరికృష్ణ, సూపర్‌వైజర్ రమేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సోమన్న ఆలయంలో ఘనంగా రథోత్సవం



పాలకుర్తిలో ఘనంగా స్వామి వారల రథోత్సవం దృశ్యం

పాలకుర్తి, మే 23 : శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో రథోత్సవం కార్యక్రమాన్ని ఆలయ అధికారులు గురువారం వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, పూజారులు మంత్రాల నడుమ ఉదయం ప్రాత: కాల సమయంలో ఉత్సవ మూర్తులను రథోత్సవంపై ఉంచి వివిధ రకాల పూలతో అలంకరించి పద్మశాలీలు ఆలయం నుంచి గుడివాడ చౌరస్తా నుంచి బొడ్రాయి, రాజీవ్ చౌర స్తా మీదుగా గుట్ట వరకు రథోత్సవం కార్యక్రమం సాగింది. కార్యక్రమంలో పూజారులు మత్తగజం నాగరాజు, ఆలయ అధికారులు, వాహనకారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులకు అడ్డాగా మారిన పాఠశాల

బచ్చన్నపేట, మే 23: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రి అయ్యిందంటే మందుబాబులు పాఠశాల ఆవరణలో కూర్చుని మద్యం సేవిస్తున్నారని, దేవాలయంగా చూసుకోవాల్సిన పాఠశాలను అపవిత్రం చేస్తున్నార ంటూ స్థానికుల మండిప డుతున్నారు. గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు వచ్చిన పలువురు అధికారులకు విచ్చలవిడిగా పడేసిన బీరు, మద్యం బాటిళ్లు కనిపించాయి. దీంతో వారు అవాక్కయ్యారు.

జనగామ జిల్లాకు శ్రీకాంతాచారి పేరు పెట్టాలి

జనగామ కల్చరల్, మే 23: తెలంగాణ పోరాట తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి పేరును జనగామ జిల్లాకు పెట్టాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు దీగోజు నర్సింహాచారి డిమాండ్ చేశారు. గురువారం జనగామ జిల్లా కేంద్రం లోని బ్రహ్మంగారి కమిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాంతాచారి బలిదానంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని, ఆయనను గౌరవిస్తూ జనగామ జిల్లాకు శ్రీకాంతాచారి పేరు పెట్టాలన్నారు. సమావేశంలో సాంబయాచారి, సిద్దిరాము లు, సాతెల్లి రాజు, సరాబోజు రాజు, మద్దోజు నవీన్, గణేష్ పాల్గొన్నారు.

రేకుల షెడ్డును తొలగించిన అధికారులు

బచ్చన్నపేట, మే 23: సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం తీర్మాణం చేసిన ప్రదేశంలో రేకులతో ఏర్పాటు చేసిన షెడ్డుకు అనుమతులు లేవంటూ జీపీ అధికారులు తొలగించారు. బచ్చన్నపేట హైస్కూల్ ప్రహరిని ఆనుకుని మూలకు సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని అఖిలపక్షం పేరుతో పలు పార్టీల నాయకులు తీర్మాణం చేసి పనులు ప్రారంభించారు. దీంతో పరిసరాలలో నివాసముంటున్న వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ప్రతి ఆదివారం సంత సాగుతుండడంతో వివిధ గ్రామాల నుంచి వందలాదిగా మండల కేంద్రానికి వస్తారని, అలాంటప్పుడు చిన్నగా నిర్మాణం చేస్తే ఏం ఉపయోగమని పలువురు ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి షెడ్‌ను తొలగించినందున అక్కడ ఏ నిర్మాణం చేపడతారోననే చర్చ సాగుతోంది.

ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

జనగామ కల్చరల్, మే 23: పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని జనగామ ఎంపీపీ మేకల కళింగరాజు కోరారు. గురువారం షామీర్‌పేట గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడు, ప్రశ్నించే గొంతుక ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రచారంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చాట్ల డానియేల్, సీనియర్ నాయకులు తెల్జీరు ఉప్పలయ్య, సంపత్, మేకల రామకృష్ణ పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

జనగామ, మే 23 (ఆంధ్రజ్యోతి): తనకు తెలియకుండా తన భార్య పేరు మీద ఉన్న భూమిని అక్రమంగా పట్టా చేశారంటూ ఆరోపిస్తూ చిల్పూరుకు చెందిన బోళ్ల రాజ్‌కుమార్ కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసనకు దిగాడు. తాను తన భార్య స్వప్న పేరు మీద గతంలో 1.24 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేశానని అన్నారు. ఈ భూమిని తన భార్య తనకు తెలియకుండా మరొకరికి రిజిస్ట్రేషన్ చేసిందని పేర్కొన్నాడు. ఒరిజినల్ పట్టాదారు పాసు పుస్తకాలు తన దగ్గరే ఉన్నప్పటికీ తహసీల్దార్ రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. తనకు తెలియకుండానే రిజిస్ట్రేషన్ చేయడం పట్ల చిల్పూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపానని అన్నారు. దీంతో స్పందించి రెండు రోజుల్లో న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని, కానీ గురువారం వెళ్లి అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని వాపోయారు. అధికారులు న్యాయం చేయకపోతే ఆత్మహత్యకైనా సిద్ధమని హెచ్చ రించారు.

రైతులు ఆగ్రోస్ సెంటర్‌ను వినియోగించుకోవాలి

నర్మెట, మే 23 : రైతులు ఆగ్రోస్ టూ సెంటర్ వినియోగించుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. నర్మెట మండలకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆగ్రోస్ టూ సెంటర్‌ను గురువారం నాగపూరి కిరణ్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంటాయన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, మాజీ జడ్పీటీసీ గాదె మోహన్‌రెడ్డి, నాయకులు కూకట్ల చంద్రమౌళి, చెవుల పరుశరాములు, భాగ్యలక్ష్మి, ప్రజ్ఞాపురం శ్రీధర్, కొన్నె తిరుపతి, పండ్ల బాలనర్సు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుర్గమ్మ తల్లికి ఎమ్మెల్యే కడియం పూజలు



దుర్గమ్మకు పూజలు చేస్తున్న కడియం

జఫర్‌గడ్, మే 23 : మండలంలోని రఘునాథ్ పల్లిలో గురువారం స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో గత మూడు రోజులుగా దుర్గమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో కడియం శ్రీహరి పాల్గొని దుర్గాదేవి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, వైస్ ఎంపీపీ కనకయ్య, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, మాజీ సర్పంచ్ బొమ్మినేని శ్రీదేవి పెద్దిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్‌లు గుజ్జరి రాజు, అన్నెబోయిన భిక్షపతి, మాజీ ఎంపీపీ కట్ట మనోజ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

జనగామ కల్చరల్, మే 23: జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాలను, వర్గీకరణ ఆకాంక్ష కోసం జాతి ఎదురుచూస్తున్న విషయాన్ని, పలు అంశాలను గుర్తు చేశారు. కిషన్‌రెడ్డిని కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు గద్దల కిషోర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పైసా రాజశేఖర్, తాళ్లపల్లి కుమార్ తదితరులు ఉన్నారు.